# ఇంటింటికి చంద్రబాబు మోసాలు

- చిన్నపలకలూరు, దానుపాలెం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'
- పాల్గొన్న వైఎస్సార్ సీపీ గుంటూరు రూరల్ మండల కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి



కరపత్రాలను చూపుతూ ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**గుంటూరు రూరల్:** చంద్రబాబు అంటేనే మోసమని, ఓట్లకోసం ప్రజలను నమ్మించి నట్టేట ముంచే రకం చంద్రబాబు అని, ఇంటింటికి చంద్రబాబు మోసాలను తీసుకెళుదామని వైఎస్సార్ సీపీ గుంటూరు రూరల్ మండల కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డిలు తెలిపారు. మండలంలోని చిన్నపలకలూరు, దానుపాలెం గ్రామాల్లో ఆదివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు, ప్రజలను మోసం చేసిన వైనాన్ని వివరించారు. ఎన్నికల సమయంలో కేవలం ఓట్ల కోసం మాత్రమే బాబు హామీలు ఇస్తారని పథకాలు మాత్రం అమలు చేయరన్నారు.

**నిరుద్యోగ భృతి రూ.45వేలు బాకీ**

ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తానని చెప్పారని కానీ రెండు సంవత్సరాలు అవుతున్నా నేటికి ఇవ్వలేదని అందుకు ప్రతి యువకుడికి చంద్రబాబు రూ 45,000 బాకీ ఉన్నారన్నారు. అదేవిధంగా మహిళలకు నెలకు రూ 1500 ఇస్తానని మోసం చేసిన విషయాన్ని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం చెప్పి అమలు చేయలేదని, తల్లికి వందనం పథకం ఎందరో అర్హులైన తల్లులకు అమలు చేయకుండా మోసం చేశారని, రైతులకు ఒకే సారి రూ.20వేలు అన్నదాత సుఖీభవ కింద ఇస్తామని చెప్పి అరకొరగా, అదీ కొందరికే అందించారన్నారు. అధికారం చేపట్టిన 15 నెలల్లో రూ.2లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులాంధ్ర ప్రదేశ్‌గా మార్చారన్నారు. అప్పులు చేసిన డబ్బంతా కేవలం తన వర్గానికి దోచిపెడుతున్నాడని తెలిపారు.

**జగనన్న పాలన స్వర్ణయుగం**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రానికి స్వర్ణ యుగం మారిందని, జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు ఏవిధంగా అందజేశారో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు, ఉచితంగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, ఇళ్లు కట్టించిన విషయాన్ని గుర్తు చేశారు. జగనన్న రెండు సంవత్సరాలు కరోనా విపత్కర సమయంలో సైతం ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించి, అందరినీ ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు మాత్రం పెంచిన విద్యుత్ చార్జీలతో ప్రజల సొమ్మును దోచుకుంటున్నాడని తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు దాసరి నాగరాజు, తుమ్మల నాగేశ్వరారవు, తోట నాగేశ్వరరావు, పిల్లి మేరీ, కొండా కోటిరెడ్డి, వంగా సీతారామిరెడ్డి, గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### లూథరన్ చర్చి పాస్టర్‌గా లెనిన్ బాబు



**పొన్నూరు:** పట్టణంలోని క్రీస్తు శతవార్షిక లూథరన్ చర్చి పాస్టర్‌గా నియమితులైన రెవరెండ్ యామర్తి లెనిన్‌బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్నేళ్లుగా వివాదస్పదంగా ఉన్న పాస్టర్ల బదిలీ వ్యవహారానికి తెరపడింది. అయితే ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన పాస్టర్ అందుబాటులో లేనిపక్షంలో లెనిన్ బాబు ప్రార్థనలు నిర్వహించేందుకు చర్చి తాళాలు తీసే క్రమంలో ఇరు వర్గాలకు వాదనలు జరిగాయి. ఈ క్రమంలో చర్చి ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకోవడంతో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలీసుల జోక్యంతో చర్చి తలుపులు తెరిచి, ప్రార్థనలు నిర్వహించారు.

ఏఈఎల్‌సీ పరిపాలనాధికారి ఉత్తర్వుల మేరకు తాను లూథరన్ చర్చి పాస్టర్‌గా తాను బాధ్యతలు స్వీకరించినట్లు పాస్టర్ లెనిన్‌బాబు తెలిపారు.

### కృష్ణ శతకం పద్యాల కంఠస్థ పోటీలకు స్పందన



**నగరంపాలెం:** స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై యోగద చారిటబుల్ ట్రస్ట్, త్యాగరాజ సాంస్కృతిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రానున్న కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం 2–7వ తరగతి చిన్నారులకు కృష్ణ శతకం పద్యాల కంఠస్థ పోటీలు, కృష్ణాష్టక గానం, దేశభక్తి క్విజ్ పోటీలు నిర్వహించారు. పోలిశెట్టి శ్రీ హరిప్రసాదరావు సౌజన్యంతో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలు, బహుమతులను ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ బి.రాఘవరావు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త డాక్టర్ బి.వరలక్ష్మి, సంఘం అధ్యక్షులు కిశోర్ పాల్గొన్నారు.

### ఘనంగా బోనాల వేడుకలు

పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



**మంగళగిరి టౌన్:** మంగళగిరి నగర పరిధిలోని సీతారామ కోవెల సెంటర్‌లో ఉన్న పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజక వర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన నిర్వాహకులు డీవీఆర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగ అధ్యక్షుడు ఊట్లపాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### నులకపేటలో బీజేపీ పట్టణ సమావేశం



**తాడేపల్లిరూరల్ :** భారతీయ జనతా పార్టీ తాడేపల్లి పట్టణ కమిటీ సమావేశాన్ని నులకపేట శివచైతన్య తపోవనంలో ఆదివారం తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లూరు శివరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టొబాకో బోర్డ్ చైర్మన్ చిడిపోతుల యశ్వంత్, ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికయిన గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యులు టంకశాల ఈశ్వర్‌నాయుడును అభినందించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులు డి.వెంకట నాగ సురేష్‌కుమార్, గట్ల శివ కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శులు వల్లభాపురపు గిరినాగకృష్ణ, బత్తుల ఆంజనేయులు, కోశాధికారి రణజీత్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శివ శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

### పాత గుంటూరులో భారీ చోరీ

**పట్నంబజారు:** ఇంటి తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు అయింది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తమ్మ రంగారెడ్డి నగర్‌లో నివసిస్తున్న ఉండి సరస్వతి ఈ నెల 9న పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా రూ. 10 లక్షల నగదు, 100 గ్రాములు బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చదువులమ్మ చెట్టు నీడలో జ్ఞాపకాల ఒడిలో..



విద్యనేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

- పెదకాకాని జెడ్పీ హైస్కూల్‌లో 2000-01 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం
- 25 సంవత్సరాల తరువాత కలుసుకున్న స్నేహితులు

**పెదకాకాని:** క్రమ శిక్షణతో కూడిన విద్యనభ్యసించడం ద్వారానే సమాజంలో ఉత్తమ వ్యక్తులుగా గుర్తింపు వస్తుందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మూల్పూరి వెంకటసుబ్బారావు అన్నారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో 2000–01 ఏడాదిలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొన్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో 25 సంవత్సరాలు తరువాత అప్పటి విద్యార్థులందరూ ఒకచోటకు చేరుకోవడం, అప్పటి విశ్రాంత గురువులను ఆహ్వానించి గౌరవించడం మంచి సాంప్రదాయమని వెంకటసుబ్బారావు కొనియాడారు. ముందుగా అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల్లో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. విశ్రాంత ఉపాధ్యాయులు 17 మంది, పూర్వ విద్యార్థులు 120 మందికి గాను 85 మంది ఈ వేడుకలకు హాజరయ్యారు. కుటుంబ సమేతంగా హాజరైన వారు ముందుగా పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు లేళ్ల వంశీ, జాస్మిన్, అనగాని జ్యోతి, గుడిపూడి మురళి, బోయిన నవీన్, అంకెం పరమేష్, ఆలపాటి ప్రమోద్, జాకుపాటి రవి, కాకాని శిరీష్, చింతా శంభునాథ్, వెంకట చెన్నయ్య, బంగారు రవీంద్ర బాబులు కార్యక్రమం నిర్వహించారు. అప్పటి పాస్‌పోర్టు ఫొటోతో ఇప్పటి ఫొటోను ఎల్ఈడీ స్క్రీన్‌పై చూసుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశానికి విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యనారాయణ, బాలకృష్ణ, ప్రసాదరావు, భట్టాచార్య, విజయ్‌కుమార్, బాలశౌరి, ఇంద్రావతి, సుశీల, కుసుమకుమారి, మీనాదేవి, భవాని, విజయలక్ష్మి, మంజుల, విమల, మేరి క్రిష్టియానా పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

### నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

**నెహ్రూనగర్:** నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

### కాపర్ వైర్ చోరీ... నిలిచిన నీటి సరఫరా



**తాడేపల్లిరూరల్:** కాపర్ వైర్ దొంగలు విజృంభిస్తున్నారు. ఏకంగా ప్రజలకు తాగునీటిని అందించే విద్యుత్ మోటార్ కాపర్ వైర్లను దొంగిలిస్తున్నారు. దీంతో తాగునీరు సకాలంలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా తాడేపల్లి పరిధిలోని కొత్తూరు ఆంజనేయస్వామి గుడి సమీపంలో నగరపాలక సంస్థ ద్వారా ప్రజలకు తాగునీరు అందించే మోటార్ వైర్లను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. స్పందించిన ఎంటీఎంసీ అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేసే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైర్లను మోటారు అంచువరకు కట్ చేయడంతో జాయింట్ వేసేందుకు సిబ్బంది అవస్థలు పడ్డారు. ఇదే మోటారుకు గతంలో మూడు సార్లు వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించారు. ఇలా కత్తిరించిన వైర్లను ఓ ప్రదేశంలో మంటవేసి కాల్చి అందులో వచ్చే రాగి తీగను ఎత్తుకుపోతున్నారని స్థానికులు అంటున్నారు.

### నేడు నగరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) :** హర్ ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి వేంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు మెగా ర్యాలీ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆజాదీ అమృతోత్సవాల్లో భాగంగా ఈ నెల 15వ తేదీ వరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రంగోలి, వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్, పోటీలు నిర్వహిస్తామన్నారు. సోమవారం జరిగే హర్ ఘర్ తిరంగా ర్యాలీలో నగర ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# రాజధాని పేరుతో లక్షల ఎకరాలు తీసుకోవడం దుర్మార్గం

42వ రోజు రిలే దీక్షలో ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరావు



రిలే దీక్షలో ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు తదితరులు

**నిడుముక్కల(తాడికొండ):** రాజధాని పేరుతో లక్షల ఎకరాల భూములు తీసుకోవడం దుర్మార్గమని ఏఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అన్నారు. రెండో విడత భూ సమీకరణకు తాము వ్యతిరేకమని కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ ఆగడాలపై తమ పోరాటం అన్నారు. రాజధాని శంకుస్థాపనకు విచ్చేసిన ప్రధాని మోదీ ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. రాజధానిపై పార్లమెంటులో చట్టం చేసి ఈ ప్రాంత రైతులకు తగిన న్యాయం చేయాలన్నారు. భూ సమీకరణ చేయాలనుకుంటే ప్రతి రైతుకు రిటర్నబుల్ ప్లాట్లతో సంబంధం లేకుండా భూమి ఇచ్చిన వెంటనే రూ.కోటి అందజేయడంతో పాటు ప్రతి నెలా వారి కుటుంబాలను పోషించుకునేందుకు రూ.10 వేలు పింఛన్ రూపంలో అందించాలన్నారు. ఈ ప్రాంత వాసిగా రైతులు, రైతు కూలీల సంక్షేమానికి కట్టుబడి తాను గత 42 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నానని, ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రభుత్వం రెండో విడత సమీకరణపై నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

ఎస్ఐ రవీంద్రనాయక్



**మంగళగిరి టౌన్:** నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని రౌడీ షీటర్లను ఎస్ఐ రవీంద్రనాయక్ హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్రనాయక్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ప్రతి రౌడీ షీటర్‌పై పోలీస్ నిఘా ఉంటుందని, ఘర్షణలు, పంచాయితీలు, సెటిల్‌మెంట్లకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమపై ఆధారపడిన కుటుంబ సభ్యుల కోసమైనా నేర సంస్కృతిని వదిలివేసి ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలు చూసుకోవాలని సూచించారు. రౌడీ హిస్టరీ ఉన్న వారికి సమాజాంలో గౌరవ మర్యాదలు ఉండవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన



**నగరంపాలెం:** స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై గుళ్లపల్లి సుబ్బారావు సేవాసంస్థ ఆధ్వర్యంలోఆదివారం జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ పాలకవర్గం, సంస్థ నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రదర్శన ప్రారంభమైంది. రాధామాధవ రసరంజని నాట్యాచార్య ఎస్.కె.ఖలీల్ శిష్య బృందం గణపతి నృత్యం, నారాయణ నారాయణ గోవింద హరే, డూడూ బసవన్న డూడూ, ఓం శివోహం, పలికే బంగారు తల్లిరో.. మా యల్లమ్మ అంటూ పలు జానపద, కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. ఆద్యంతం ప్రేక్షకులను అలరించాయి. చివరగా గుళ్లపల్లి సుబ్బారావు, నాట్యాచార్య ఎస్కె.ఖలీల్, శిష్య బృందాన్ని సత్కరించారు.

# గంగానమ్మకు శ్రావణమాస పూజలు



వెనిగండ్లలో పూజలందుకుంటున్న భ్రమరాంబ అమ్మవారు

**పెదకాకాని:** పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని కోరుతూ భక్తులు గంగానమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాస పర్వదినం ఆదివారం మండలంలోని వెనిగండ్ల గ్రామంలో వేంచేసియున్న గంగానమ్మ అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ దేవతలకు కొలుపులు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో భక్తులు ఉదయం మేళ తాళాలతో బొడ్డురాయి సెంటర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారికి పొంగలి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం నాంచారమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములతో పూజలు చేశారు. సాయంత్రం కనక తప్పెట్లు, డీజే నృత్యాలతో కోలాహలంగా గంగానమ్మ ఆలయానికి చేరుకుని పూజా ద్రవ్యాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పుట్టిళ్లకు ఆడపడుచులు రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. సామూహిక పూజలతో ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. అధికసంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

# పొన్నూరు కవులకు ఘన సత్కారం




కవి శ్రీనివాస్‌ను సత్కరించిన నిర్వాహకులు

**పొన్నూరు:** విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో పొన్నూరు సాహితీ కవులకు ఘన సత్కారం లభించింది. ఆదివారం తెలుగు పొయెట్రీ ఫెస్టివల్, అమరావతి ఆర్ట్ ఫౌండషన్ త్రివర్ణోత్సవం సందర్భంగా నిర్వహించిన శత కవుల సమ్మేళనంలో పాల్గొని, 'మూడు రంగుల జెండా' అనే వచన కవితా పఠనం చేసిన మండలంలోని బ్రాహ్మణ కోడూరుకు చెందిన ప్రముఖ కవులు సోపాటి ప్రభాకర్, గొర్రెపాటి శ్రీనివాస్‌లను, 'స్వాతంత్ర్యంలో దేశభక్తులు' కవితా పఠనం చేసిన కవి, ఆర్టీసీ కండక్టర్ షేక్ రహీం సాహెబ్‌లను సత్కరించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పొట్లూరి హరికృష్ణ, అమరావతి ఆర్ట్ ఫౌండషన్ అధ్యక్షురాలు కె.వి జయలక్ష్మి ముగ్గురు కవులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కవులను పొన్నూరు పట్టణ పరిసర ప్రజలతో పాటు ఆర్టీసీ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వ పెద్దలకు బీసీలంటే చిన్నచూపు

అఖిల భారత బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఓర్సు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

**పట్నంబజారు:** కూటమి ప్రభుత్వ పెద్దలకు బీసీలంటే చిన్నచూపని అఖిల భారత బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఓర్సు శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. గుంటూరు అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయని చంద్రబాబు ఏ మొఖం పెట్టుకుని తాను బీసీల కోసం పనిచేస్తున్నానని చెబతారని ప్రశ్నించారు. జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లిన రమేష్ యాదవ్‌పై దాడిని కనీసం ఖండించకపోవడం సిగ్గుచేటని తెలిపారు. ఇది బీసీ కులాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే దాడిగా తాము భావిస్తున్నామని స్పష్టం చేశారు. అత్యంత పాశవికంగా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై గూండాలు దాడి చేస్తే, ఇప్పటికీ వరకు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవటం బీసీలపై చంద్రబాబుకు ఉన్న ప్రేమ ఏమిటో అర్థమవుతోందని తెలిపారు. పులివెందులలో వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీని గెలిపించాల్సిన బాధ్యత బీసీలందరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు.

# ముగిసిన చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లిలోని అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ సి, డి బ్లాక్‌లలో బాలబాలికలకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తమకు నచ్చిన రంగాలను ఎంచుకుని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీయడానికి వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, అమరావతి ఐకాన్ ఓనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అలహరి శివ సతీష్‌కుమార్, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు జీఎస్ఆర్ మోహనరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి జెట్టి శ్రావణి, ట్రైనర్ చంద్ర ఓబులారెడ్డి, విజయ, క్షితిజ, మనోహర్ రెడ్డి, ఫిరోజ్‌ఖాన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ముందు జాగ్రత్తలతో పక్షవాతానికి అడ్డుకట్ట




మాట్లాడుతున్న డాక్టర్ నటరాజ

**గుంటూరు మెడికల్:** షుగర్‌ను, అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవడం ద్వారా ప్రమాదకర పక్షవాతాన్ని నిరోధించవచ్చని నటరాజ్ న్యూరో కేర్ వ్యవస్థాపకులు డాక్టర్ పి. నటరాజ అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించాయి. డాక్టర్ నటరాజ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి. సేవకుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ పి.నటరాజ మాట్లాడుతూ మధుమేహం, అధిక రక్తపోటు బాధితులు వాటిని అదుపులో ఉంచుకోక పోవడంతో పక్షవాతానికి గురవుతున్నారని తెలిపారు. మధుమేహం, అధిక బీపీ బాధితులు వైద్యుని పర్యవేక్షణలో అదుపులో ఉంచుకోవడం ద్వారా మెదడు, నరాల వ్యాధులను నియంత్రించవచ్చని చెప్పారు. ధూమ, మద్యపానం గుట్కా, పొగాకు నమలడం వంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ అవగాహన కలిగించడం ద్వారా వివిధ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా స్పెషలిస్టులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. డాక్టర్ టి. సేవ కుమార్ మాట్లాడుతూ నేడు చాలా మంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం లేదని తెలిపారు. ముఖ్యంగా యువత అనారోగ్యం కుటుంబం, రాష్ట్ర, దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరు వయసుతో సంబంధం లేకుండా ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. అనంతరం మెదడు, నరాల వ్యాధుల బాధితులను డాక్టర్ పి. నటరాజ పరీక్షించి, వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మేకా రామారావు, టి.వి.సాయిరామ్ పాల్గొన్నారు.

# అనుమానాస్పద వ్యక్తి పోలీసులకు అప్పగింత

**పట్నంబజారు:** పాత గుంటూరు పరిసర ప్రాంతాల్లో పశువులు, మేకలను ఎత్తుకు వెళ్తున్నాడనే అనుమానంతో ఒక వ్యక్తిని స్థానికులు పోలీసులకు అప్పచెప్పారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నూరు రోడ్డు, ఆనంద పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానికులు ప్రశ్నించగా, సరైన సమాధానం చెప్పలేదు. దీంతో అతడిని పాత గుంటూరు పోలీసులకు అప్పచెప్పారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.